ప్రజాశక్తి
బుధవారం 25 డిసెంబర్ 2024
కాకినాడ

## సంక్రాంతికి ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - కాకినాడ

సంక్రాంతి పండుగకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 9, 10, 11, 12 తేదీల్లో హైదరాబాద్ నుంచి జిల్లాలోని మూడు డిపోల పరిధిలో బస్టాండ్‌కు రోజుకు 20 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. ప్రత్యేక సర్వీసుల్లో వచ్చి వెళ్లడానికి ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేయించుకున్న వారికి ధరలో 10 శాతం రాయితీ ఇస్తామన్నారు. సాధారణ ధరలకే ప్రత్యేక సర్వీసులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆర్‌టిసిలోని కార్గో డోర్ డెలివరీ సర్వీసును ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# సకాలంలో రబీ సాగేనా..?

- ఈనెలాఖరులోపు నాట్లు పూర్తికి లక్ష్యం
- నేటికీ 30 శాతం కూడా పూర్తి కాని వైనం
- పూర్తిస్థాయిలో అందని సాగునీరు..?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

డిసెంబరు 1 నుంచి ప్రారంభమయ్యి డిసెంబరు 31 నాటికి నాట్లు పూర్తి చేసుకోవాలని రైతులకు సూచిస్తూ వ్యవసాయ శాఖ అధికారులు ఈ ఏడాది రబీ ప్రణాళికలు రూపొందించారు. అయితే సాగునీటి వ్యవస్థల ఆధునీకరణ లేకపోవడంతో ఈ సారి కూడా పూర్తిస్థాయిలో సాగునీరు సక్రమంగా అందని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ ఏటా మొక్కుబడిగా ప్రణాళికలు సిద్ధం చేయడం తప్ప అందుకు అనుగుణంగా సాగునీటిని అందించడాన్ని శ్రద్ధ అధికారుల నుంచి కొరవడిందనే విమర్శలు లేకపోలేదు. ముఖ్యంగా పిఠాపురం నియోజకవర్గం వంటి శివారు ఆయకట్టు రైతులకు ఏటా అతివృష్టి..అనావృష్టి పరిస్థితులు తప్పడం లేదు. దీంతో రైతులు నష్టాల నుంచి బయట పడలేకపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఇప్పటికైనా స్పందించి సాగునీటి వనరులను త్వరితగతిన అభివృద్ధి చేసి పుష్కలంగా సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

**ముందుకు సాగని సాగు**

గోదావరి తూర్పు డెల్టా పరిధిలోని 1,05,341 ఎకరాలు, పిఠాపురం బ్రాంచ్ కెనాల్ కింద 32,507 ఎకరాలు, ఏలేరు రిజర్వాయర్ కింద 53,017 ఎకరాలు మొత్తం 1,90,865 ఎకరాల ఆయకట్టుకు రబీ సాగునీరు అందించేందుకు జిల్లా సాగునీటి సలహా మండలి తీర్మానించింది. అలాగే సుమారు 20 వేల ఎకరాల్లో అపరాల సాగు జరగనుంది. ఈ మేరకు జిల్లాలో ఈ ఏడాది 1.79 లక్షల ఎకరాల్లో రైతులు వరిని సాగు చేయనున్నారు. అయితే 2025 మార్చి 31లోగా పంటలను పూర్తి చేసుకోవాలనే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ అందుకు అనుగుణంగా పనులు జరగడం లేదు. ఇప్పటి వరకు 50 శాతం పైబడి అంటే దాదాపు 90 వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి కావాల్సి ఉంది. కానీ అందుకు తగ్గట్టుగా నాట్లు పడలేదు. కేవలం 4,237 ఎకరాల్లో అంటే 3 శాతం లోపే నాట్లు పడ్డాయి. ఇప్పటి వరకు 1207 ఎకరాల్లో మాత్రమే నారు మడులను సిద్ధం చేయగా, 2,843 ఎకరాల్లో ఎదజల్లు సాగు జరిగింది. 1392 ఎకరాల్లో నాట్లు వేశారు. ముందస్తుగా నాట్లు వేయడం, వెదజల్లే పద్ధతి ద్వారా జిల్లాలో వరి సాగు ఆశాజనకంగా ఉంటుందని భావించిన రైతులకు నిరాశే మిగులుతుంది. పూర్తిస్థాయిలో అందుబాటులో ఎరువులు ఉంచకపోవడం, సకాలంలో విత్తనాలు సరఫరా చేయకపోవడంతో పాటు సాగునీరు సక్రమంగా అందని పరిస్థితులు నడుమ ఈ ఏడాది కూడా రబీ పనులు ముందుకు సాగడం లేదు. సాగునీటి ఇబ్బందుల ముందున్న దృష్ట్యా అధికార యంత్రాంగం ముందస్తుగా అప్రమత్తం కావాల్సి ఉన్నా అందుకు తగ్గట్టుగా సన్నద్ధత లేదని విమర్శలు రైతుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఏలేరు ఆధునీకరణ లేకపోవడంతో రైతాంగం ఏటా ఇబ్బందులు పడుతూ నష్టాల్లో కూరుకుని పోతున్నారు. ప్రధానంగా రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం ఏలేరుకి శివారు ఆయకట్టుగా ఉండడంతో సమస్యలు తప్పడం లేదు. మూడు నెలల కితం వచ్చిన వరదల వలన 280 చోట్ల గండ్లు పడ్డాయి. వాటిని పూడ్చి సాగునీరు అందివ్వాల్సి ఉంది. కానీ నేటికీ గండ్లు పూడ్చివేత పనులు పూర్తి కాలేదు. ఇలా అనేక సమస్యలున్నాయి. సాగు సీజన్‌ను ముందుకు తీసుకురావడం వలన ప్రకృతి వైపరీత్యాల వలన నష్టం వాటిల్లకుండా బయట పడవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు తరచూ చెప్తుకొస్తున్నారు. నిర్దేశించిన సమయానికి రబీ పూర్తయితే మార్చి 15వ తేదీ కల్లా పంట చేతికొస్తుంది. ఆ తర్వాత 75 రోజుల్లో అపరాలు మూడో పంటగా సాగు చేసుకోవచ్చు. జూన్ మొదటి వారంలోనే ఖరీఫ్ పనులను మొదలు పెట్టుకోవచ్చు. దీనివలన సీజన్ ముందుకు వస్తుంది. అక్టోబరు, నవంబరులలో వచ్చే తుపానులు, వరదల వలన నష్టం రాకుండా ఉంటుంది అని ఈ సంవత్సరం కూడా చెప్పుకొచ్చారు. కాని అందుకు అనుగుణంగా యంత్రాంగంలో సన్నద్ధత మాత్రం లేకుండా పోయింది. దీంతో ఈ ఏడాది కూడా అన్నదాతలకు నష్టాలు తప్పేలా లేవని తాజా పరిస్థితులను బట్టి తేటతెల్లమవుతుంది.

రైతులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

## సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కాజులూరు

రబీలో సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పుమిల్లి శివారు గొప్పిరేవు వద్ద టేకి డ్రెయిన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తమ ప్రాంతంలో అనేకమంది చిన్న, సన్నకారు రైతులు అధికంగా ఉన్నారని, శివారు ప్రాంతం కావడంతో ప్రతీ ఏడాది నీటి ఎద్దడిని ఎదుర్కొని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి సుభాష్ మాట్లాడుతూ గతంలో ఇక్కడ లిఫ్ట్ పెట్టుకోవడానికి రైతులు చాలా ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి రానివ్వకుండా ముందుగా తాత్కాలిక లిఫ్ట్ పద్ధతి ద్వారా నీటి పంపిణీ జరుగుతుందని అన్నారు. ఇప్పటికే ఈ అంశంపై అసెంబ్లీలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రితో చర్చించి శాశ్వత లిఫ్టు ఏర్పాటుకు కృషి చేయడం జరుగుతుందని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి డిసి ఛైర్మన్ దాట్ల విజయగోపాలరాజు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు దాట్ల బుచ్చిబాబు, చిరవూరి వెంకటసత్యనారాయణ రాజు, బొండా వెంకటేశ్వరరావు, యాళ్ళ తణి, యాళ్ల రఘురాంపాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - కాకినాడ

సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాహుల్‌మీనా

పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన, సంతృప్తికరమైన సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ అర్జీలపై జిల్లా అధికారులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ర్యాంకింగ్ ప్రధానంగా 5 పారామీటర్స్ మీద నిర్ణయిస్తారని, ప్రజల నుంచి అందిన అర్జీల సంఖ్య, నిర్దిష్ట కాలపరిధిలో పరిష్కరించిన అర్జీల సంఖ్య, అర్జీదారులకు సంతృప్తితో అందించిన నాణ్యమైన పరిష్కార సంఖ్య, ప్రజాప్రతినిధులు సూచించిన అంశాలపై పరిష్కారాలు, వాటిలో సంతృప్తి నందించిన పరిష్కారాలు అనే అంశాల ఆధారంగా జిల్లాలకు ర్యాంకింగ్ ఇస్తారన్నారు. జిల్లాలో పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కార స్థాయి 62.7 శాతంగా ఉందని, దీనిని మరింత మెరుగుపరచి రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకింగ్ సాధించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అర్జీల పరిష్కారంలో నిర్దేశించిన విధివిధానాలను సమగ్రంగా పాటించి, చేపట్టిన చర్యల సమాచారాన్ని, అర్జీదారునికి పరిష్కారంపై వివరించి తీసుకున్న ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలని ఆయన ఆదేశించారు. అర్జీల పరిష్కార నాణ్యత, ఆర్జీదారుల సంతృప్తి సాధన, రీ ఓపెన్ చేసిన అర్జీల అంశాలను జిల్లా అధికారులు ఆడిట్ చేసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారాన్ని గడువు సమీపించే వరకూ జాప్యం చేయకుండా సకాలంలో చర్యలు పూర్తి చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులందరూ హౌస్ హోల్డ్ మాపింగ్ మాడ్యూల్‌లో తమ సమచారాన్ని వెంటనే అప్ లోడ్ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ జె.వెంకట్రావు, సిపిఒ పి. త్రినాథ్, ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, డిఎల్‌డిఒ కె.వాసుదేవరావు, ఎస్‌డిసి వెంకట్రావు పాల్గొన్నారు.

## హారికకు పలువురి అభినందన

ప్రజాశక్తి - కాకినాడ

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో మెటలార్జికల్ ఇంజినీరింగ్‌లో పిహెచ్‌డి చేసేందుకు ఎంపికైన ఐ.వీరరాఘవవెంకటహారికను పలువురు అభినందించారు. హారిక ఆంధ్ర యూనివర్సిటీలో ఎంటెక్ డిస్టెక్షన్‌లో ఉత్తీర్ణత సాధించింది. హారిక తండ్రి ఐ.ప్రసాదరావు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. హారిక ప్రస్తుతం అడ్వాన్స్డ్ రీసెర్చ్ సెంటర్(ఎఆర్‌సి)లో జూనియర్ సైంటిస్ట్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా హారికను పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపిమూర్తి, యుటిఎఫ్ నాయకులు చక్రవర్తి, నాగేశ్వరరావు, హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

## ఐలాజ్ జాతీయ సహాయ కార్యదర్శిగా బుగత శివ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఐలాజ్ జాతీయ సహాయ కార్యదర్శిగా ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బుగతా శివ ఎంపికయ్యారు. ఈనెల 22న ఒడిశాలోని కటక్‌లో జరిగిన ఐలాజ్ జాతీయ మహాసభలో ఈ ఎంపిక జరిగిందని మంగళవారం ఆయన మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ దేశంలో న్యాయవాద పరిరక్షణ చట్టం తీసుకురావాలని, రాజ్యాంగాన్ని కాపాడడం కోసం న్యాయవాదులు ముందుండి పోరాడాలన్నారు.

## యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఎస్.సంజీవ్, అధ్యక్షులు

కె.రవి, కార్యదర్శి

యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. మంగళవారం స్థానిక పెన్షనర్స్ హోంలో యుటిఎఫ్ జిల్లా బాధ్యులు జట్ల సోమరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్య క్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కెవివి.నగేష్ పాల్గొని మాట్లాడారు. జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరిగే యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా ఉపాధ్యాయులు తరలి వస్తారని అన్నారు. ఉపాధ్యా య సమస్యలపై పోరాటాలు, సాధించిన విజయాలు భవిష్యత్తు నిర్ణయాలపై చర్చిస్తామన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.సంజీవ్, కె.రవి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా జి.సుందర్రావు, అసోసియేట్ అధ్యక్షులుగా బి.రాం బాబు, ఎన్ నాగమణి, కోశాధికారిగా టి.మురళీ కృష్ణ, సహ కార్యదర్శులుగా ఒ.రాజు, జె.అప్పా రావు, పి.గంగాధర్ రావుదొర, కె.దేవదేవి, డి.శిరీష, ఎన్.శ్రీనివాస రావు, జివివి.సత్యనారా యణ, ఎం.శ్రీనివాసరావు, వి.వీరబాబు, విఆర్‌కె.రెడ్డి, ఆర్.నాగేంద్రరావు, ఆడిటర్‌గా ఎన్ రాజు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నేత మెతకాని రాంబాబు, జిల్లా కార్య దర్శులు పివి.సత్య నారాయణ, ఎస్.వీరబాబు పాల్గొన్నారు.

## 28న మత్స్యకారులకు నష్ట పరిహారం పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు

మత్స్యకారులకు ఒఎన్‌జిసి నుంచి రావాల్సిన నష్టపరిహారం రూ.148.37 కోట్లను ఈ నెల 28న లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తామని ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు తెలిపారు. మంగళవారం కోరంగి పరిధిలోని కాలభైరవ స్వామి ఆలయంలో జరిగిన మత్స్యకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని 4 మండలాలతో పాటు, అయినవిల్లి, కపిలేశ్వరపురం, కె.గంగవరం, కొత్తపేట మండలాలకు చెందిన 23,458 మందికి ఒక్కొక్కరికి రూ.63,250 చొప్పున నష్ట పరిహారాన్ని అందజేస్తామన్నారు. ఒఎన్‌జిసి రెండేళ్ల కాలానికి మత్స్యకారులకు ఒప్పందం ప్రకారం ఇవ్వాల్సిన నష్టపరిహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ పరిహారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఖాతాలో జమ అయిందని, ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ కారణంగా ఇవ్వలేక పోయామని తెలిపారు. తాళ్ళరేవు మండలంలో 7050 మంది, కాట్రేనికోనలో 9251, ఐ. పోలవరంలో 3709, ముమ్మిడివరం 868, అయినవిల్లి 533, కపిలేశ్వరపురం 505, కె.గంగవరం 1352, కొత్తపేట 190 మందికి లబ్ధి చేకూరనున్నట్లు తెలిపారు. ఈనెల 28న జరిగే కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఎంఎల్‌ఎలు, పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ వనమాడి వెంకటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మత్స్యకార గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

## 27న జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

సమావేశంలో మాట్లాడుతున్న గిరిబాబు

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ప్రత్తిపాడు విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు తెలిపారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఛార్జీలను పెంచడం దారుణమన్నారు. నవంబర్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా రూ.6,072 కోట్లు, డిసెంబర్ నెలలో రూ,9,412 కోట్లు కలిపి మొత్తం రూ.15,484 కోట్ల భారాలను వినియోగదారులపై వేశారని అన్నరు. వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు జరిగే ధర్నాలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## ఘనంగా జాతీయ దంతవైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

డాక్టర్ అడ్డాలను సత్కరిస్తున్న డాక్టర్ నాయుడు

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ సేవలు యువతకు ఆదర్శమని అన్నారు. గత 26 సంవత్సరాలుగా కాకినాడ పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ఆయన అందిస్తున్న వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, గౌరీ ప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలపై ఇఒపిఆర్‌డి విచారణ

ప్రజాశక్తి - సామర్లకోట

విచారిస్తున్న ఇఒపిఆర్‌డి భైరవమూర్తి

మండలంలోని పనసపాడు గ్రామానికి చెందిన భూ ఆక్రమణలపై ఇఒపిఆర్‌డి భైరవమూర్తి విచారణ నిర్వహించారు. పనసపాడు గ్రామంలో 233 సర్వే నెంబర్‌లోని బండి బాట రోడ్డు మార్గంలో భూ కబ్జా, అక్రమ కట్టడాలు, నిధులు దుర్వి నియోగంపై గ్రామానికి చెందిన బిసి నాయ కుడు రాయుడు మోసెస్ 4 నెలల క్రితం కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం ఆయన గ్రామంలో పర్యటించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలపై ఆయన విచారించారు. తమ విచారణలో వచ్చిన అంశాలను నివేదిక రూపంలో జిల్లా ఉన్నతాధికారులకు నివేది స్తామని అన్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారు మోసెస్ మాట్లాడుతూ విచారణ చేసినా తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం లేదని, తమ ప్రశ్నలకు పొంతన లేని సమాధానం చెబుతున్నారని అన్నారు. అక్రమ కట్టడాలను తొలగించి, పంచాయతీ నుంచి కాంట్రాక్ట్ బిల్లులు నిలుపుదల చేసి, రహదారి మార్గం ఏర్పాటు చేయాలని, నిధులు మళ్లించిన ఆర్‌డిఒ, డిపిఒలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శులు ఎం.ముసలయ్య, పి.మణి కుమార్, శెట్టిబలిజ సేవా సంఘం జిల్లా సభ్యులు ఎ.నారాయణ పాల్గొన్నారు.

## కారణం రాయకపోతే జీతాల్లో కోత

ప్రజాశక్తి - పెదపూడి

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సచివాలయం సిబ్బంది విధి నిర్వాహణలో బయటకు వెళ్తే మూమెంట్ రిజిస్టర్‌లో కారణం తెలియ చేసి వెళ్లాలని, లేకపోతే జీతాల్లో కోత తప్పదని ఇఒపిఆర్‌డి ఎంఎస్ఎన్.రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం సాయంత్రం హెచ్‌ఆర్‌ఎం ఎస్లోలో పేస్ అటెండెన్స్ వేయాలన్నారు. ఏదైనా పని మీద బయటకు వెళితే తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో కారణాన్ని రాసి వెళ్లాలని అన్నారు. అలాకాని పక్షంలో జీతాల్లో కోత తప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు గుర్తుంచి రక్షణ కల్పించాలని ఆదేశించారు. హౌస్ హోల్డ్ సర్వేలో మిస్సింగ్ సిటిజెన్లను గుర్తించాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యస్థ వ్యాపార సంస్థల సర్వే తొందరగా పూర్తి చేయాలన్నారు. క్లోరినేషన్ చేయబడిన సురక్షితమైన తాగు నీరును ప్రజలకు అందించాలని, ప్రతి రోజు తడి, పొడి చెత్త వేరు వేరుగా సేకరింప చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు.

## కార్టూ'నిజం'




అమరావతి ఆదాయంతో
అప్పులు చెల్లిస్తాం

## క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధం

కాంతులతో విరాజిల్లుతున్న ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి

వెలుగుల మధ్య సామర్లకోటలో లుథరన్ చర్చి

జిల్లాలో క్రిస్మస్ వేడుకల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం, తుని, వంటి ముఖ్య పట్టణాలతోపాటు, ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో చర్చిలను క్రిస్మస్ వేడులకు సిద్ధం చేశారు. విద్యుత్ అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. యేసుక్రీస్తు జన్మదిన వేడుకలను బుధవారం అత్యంత ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు.

-సామర్లకోట

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

## సహకార వ్యవస్థ మరింత బలోపేతం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తెలుగు రాష్ట్రాల్లో సహకార సంస్థ మరింత బలోపేతానికి కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆ శాఖ ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక పిఎసిఎస్ కార్యాలయ ఆవరణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం సహకార మంత్రిత్వ శాఖ సహకార సంఘాల విస్తరణకు, సంఘాల బలోపేతానికి వనరుల సమీకరణకు అనేక మార్గదర్శకాలు రూపొందించిందన్నారు. రానున్న ఐదేళ్లలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 1.03 లక్షల మల్టీపర్పస్ పిఎసిఎస్‌లు, 1.06 లక్షల పాల ఉత్పత్తిదారుల సంఘాలు, 11 మత్స్యకార సహకార సంఘాలు నాబార్డ్ సహకారంతో రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సంఘాల నిర్వహణ, కంప్యూటరీకరణపై సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మేనేజర్ రవికుమార్, సూపర్‌వైజర్ నాగేంద్ర, పిఎసిఎస్ సిఇఒ జ్యోతుల నాగసత్యశ్రీనివాస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - తాళ్లరేవు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి

మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎంపిపి రాయుడు సునీత మంగళవారం శంకుస్థాపన చేశారు. పటవల పంచాయతీ శివారు శాంతమూల నుంచి తణుకువాడ వరకు రూ.5 లక్షల వ్యయంతో గ్రావెల్ రహదారికి, రూ.4 లక్షల వ్యయంతో సిసి డ్రెయినేజీ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. స్థానిక జెల్లావారిపేట, పెంకెవారిపేటలో రూ.8.5 లక్షలతో నిర్మించే సిసి రోడ్డుకు, పక్షుల పుంతలో రూ.3 లక్షల వ్యయంతో పైప్‌లైన్ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పటవల సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, తాళ్లరేవు మాజీ సర్పంచ్ రెడ్డి బాబు, టిడిపి నాయకులు రాయుడు గంగాధర్, భజన సత్తిబాబు, బోనం శ్రీనివాస్, వాసంశెట్టి గోవిందు, వత్సవాయి రాజబాబు, మేకల కృష్ణ, మేడిశెట్టి శివ పాల్గొన్నారు.

## పండగ కానుకలు గాలికేనా..?

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఎన్నికలవేళ కూటమి ప్రభుత్వం అనేక హామీలను గుప్పిచ్చింది. అధికారం చేపట్టిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ప్రచారం దండిగా చేసింది. పండగల వేళ పేదలకు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ కానుకలు అందజేస్తామని ప్రకటించారు. అధికారం చేపట్టి ఐదు నెలలు గడుస్తున్న ఎన్నికల హామీలను ప్రభుత్వం పక్కన పెట్టేసిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. టిడిపి పాలనలో క్రిస్మస్ కానుకను ఇచ్చిన పరిస్థితి ఉంది. ఈ ఏడాది క్రిస్మస్ కానుకకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంపై ఆ పథకాన్ని ఆశించిన వారు పెదవి విరుస్తున్నారు.

# నేరాలు ఘోరాలు

## పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పురుగుల మందు తాగిన ఒక వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చందుర్తి గ్రామానికి చెందిన బొల్లం సత్తిబాబు(47) డ్రైవర్‌గా పనిచేస్తూ 5 నెలల క్రితం పక్షవాతానికి గురయ్యాడు. నాటి నుంచి ఆసుపత్రికి తిరుగుతూ మందులు వాడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఒకపక్క పక్షవాతాం, మరోపక్క ఆర్థిక ఇబ్బందులు తోడవ్వడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన సత్తిబాబు ఆదివారం ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపసార్మక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతని ఆరోగ్యం విషమించడంతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

## 800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మామిడాడలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. కాట్రావులపల్లి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో ఒక మహిళ నుంచి 8 అక్రమ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడులకు సంబంధించి ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే పెద్దాపురం మండల పరిధిలోని పాత సారా కేసులలో ముద్దాయిలను తహశీల్దార్ సిహెచ్.వెంకట లక్ష్మి ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజానగరం ఎస్‌ఐపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం ఎస్‌ఐ మనోహర్ దురుసు ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా సిఐ వీరయ్యగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై రశీదు ఇవ్వాలని స్టేషన్ ఆవరణలోనే బైఠాయించారు. జక్కంపూడి మాట్లాడుతూ ఈ నెల 23న మండలంలో తూర్పు గోనగూడెంలో కాలభైరవడు తీర్థంలో వివాదం చెలరేగిందన్నారు. ఈ నేపథ్యంలో చెల్లా కాశీరాం ఇంట్లో ఉన్న గ్రామానికి చెందిన ఆకులు విజయ్, ఆకుల సాయి, డేగల హరిలను మనోహర్ అన్యాయంగా కొట్టారన్నారు. ఎస్‌ఐ మనోహర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ దురుసు ప్రవర్తనపై మానవహక్కుల సంఘం, హోం శాఖకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట వైసిపి మండల కన్వీనర్ దూలం పెద్ద, సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఎంపిటిసి వల్లభశెట్టి వెంకటరమణ, ప్రగడ చక్రి, సంగీత ప్రసాద్, ఆకులు శ్రీను తదితరులున్నారు.

## రాజేశ్వరి సేవలు మరువలేనవి

ప్రజాశక్తి - పిఠాపురం

మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ దేవరపల్లి రాజేశ్వరి పట్టణానికి చేసిన సేవలు మరువరానివని మాజీ ఎంపి, వైసిపి పిఠాపురం నియోజవర్గ ఇన్‌ఛార్జ్ వంగా గీత అన్నారు. మంగళవారం రాజేశ్వరి 15వ వర్ధంతిని స్థానిక ఆర్ఆర్ పార్కులో ఎపి కాంగ్రెస్ కమిటీ సెక్రెటరీ మేడిది వెంకట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి వంగా గీత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజేశ్వరి పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు, జనసేన పార్టీ నాయకులు పిల్ల శ్రీధర్, కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మల్లిపూడి రాంబాబు, పిఠాపురం మున్సిపల్ ఛైర్మన్ గండేపల్లి సూర్యావతి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ వర్ధినీడి సుజాత, సిపిఎం నాయకులు కె.చిన్న, కోనేటి రాజు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - జగ్గంపేట

రోడ్డు ప్రమాదాల నివారణపై సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగ్గంపేట, గండేపల్లి ఎస్‌ఐలు రఘునాథరావు, యు.శివనాగబాబు సిబ్బందితో మంగళవారం జగ్గంపేటలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి హెల్మెట్లు ధరించి రామవరం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, దీని వల్ల ప్రమాదాలను అరి కట్టవచ్చని అన్నారు. అనంతరం జగ్గంపేట బస్టాండ్‌లో హెల్మెట్ దరిద్దాం..రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

## ఆదిత్యలో ఆన్‌లైన్ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో 'ఎఐ టూల్స్' అనే ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ డి.నాగతేజ్ ప్రారంభించి తన సందేశాన్ని ఇచ్చారు. ఈ కోర్సు డిసెంబర్ 28వ తేదీ వరకూ ప్రతిరోజు సాయంత్రం 6:00 గంటల నుంచి 7.30 గంటల వరకూ జరుగుతుందని యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ అకడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.వీరాంజనేయులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు రాబోయే ప్రమాదాల నివారణకు ముందుగానే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను వినియోగించాలన్నారు. డ్రైవింగ్ చేసే వ్యక్తితోపాటు, వెనుక కూర్చునే వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్‌ను వాడాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సమస్యలపై పోరాటం

### - పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపిమూర్తి

విజయోత్సవ సభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి

ప్రజాశక్తి - కాకినాడ

అన్ని వర్గాల సమస్యలపై మండలితోపాటు, బయట పోరాటం చేస్తానని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్ర గోపిమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక యుటిఎఫ్ హోంలో యుటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు కెవివి.నగేష్ అధ్యక్షతన టీచర్స్ ఎంఎల్‌సి విజయోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించారని అన్నారు. ఉపాధ్యాయుల, అధ్యాపకుల హక్కులను సాధించాడానికి శాసన మండలిలో కృషి చేస్తానని అన్నారు. బయట ప్రజా ఉద్యమాల్లో భాగస్వామిగా ఉంటానని అన్నారు. ఈ సమావేశంలో పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికల చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా మొదటి ప్రాధాన్యత ఓటుతో అత్యధిక మెజారిటీతో గెలిపించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికుల గురించి శాసన మండలిలో గొంతెత్తి ప్రశ్నించేది ఒక్క పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్రమేనని అన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో యూటిఎఫ్‌ను ఓడించడానికి మిగిలిన అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఏకమై విఫలయత్నం చేశాయని, రెండు జిల్లాల అధ్యాపక ఉపాధ్యాయులు విజ్ఞతతో వ్యవహరించి సమస్యలపై రాజీ లేని పోరాటం చేసే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిని గెలిపించారని అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికలలో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్ట కుండా గెలిచేది ఒక్క పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మాత్ర మేనని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు పిడిఎఫ్ అంటే అంత నమ్మకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్ట్ సంఘాల నాయకులు టి.రవిచక్రవర్తి, మాణిక్యం, టి.అన్నారాము, జి.ప్రభాకర్ వర్మ, కె.సత్తిరాజు, బి.అశోక్, సుందరయ్య, ప్రజా సంఘాల నాయకులు ఎం.రాజశేఖర్, డి.శేషబాబ్జి, బేబిరాణి, రమణి, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కెఎంఎంఆర్.ప్రసాద్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు, అధ్యాపక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

**ప్రత్తిపాడు** మండలంలోని ధర్మవరంలో బెతెస్ద యెరూషలేము ప్రార్థన మందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో వైసిపి నాయకుడు, ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు. కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రిస్మస్ వేడుకల్లో ఆయనను సంఘ కాపరి భీమరాజు, సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెందుకూరి సుశీల అబ్బాయి, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, జువ్వల దొరబాబు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక అమృత ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అతిథులుగా పాస్టర్ బ్రహనం, లీలా పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. విద్యార్థులు ఆటలు, పాటలు , వివిధ రకాల నాటికలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేతలు కొమ్ము సంజయ్‌కుమార్, గంటా లోవరాజు పాల్గొన్నారు. **కాకినాడ** కాకినాడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాస్టర్ ఎన్.జోసఫ్‌శామ్యూల్ హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురికి దుస్తులు అందించారు. జర్నలిస్టులకు తన వంతు సహకారం ఉంటుందని శ్యామ్యూల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్యామ్యూల్‌ను ప్రెస్‌క్లబ తరుపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఎ.రామారావు, జి.శోభన్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు. **కాకినాడ** స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు, ఆదిత్య స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ మహమ్మద్ షాహిద్దీన్ మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జట్ల గణేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తేజేశ్వరరావు, అధ్యాపకులు ఎస్.కృష్ణబాబు, పి.సురేష్, పి.గంగాధర్, సత్యశిరీష, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొ న్నారు. **పిఠాపురం** స్థానిక సీతయ్య గారి తోటలో ఉన్న హార్వెస్ట్ ది కాన్సెప్ట్ స్కూల్‌లో యు.దాస్ ఆధ్వర్యంలోనూ, భాష్యం స్కూల్లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో స్కూల్ కరస్పాండెంట్లు పి.సత్యా మోహన్‌రెడ్డి, వి.సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ అనిల్ రవీంద్ర, ప్రిన్సిపల్ పోలిపర్తి వేణు, ప్రైమరీ హెచ్ఎం ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిఠాపురంలో నాటక ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ప్రత్తిపాడులో ముదునూరిని సత్కరిస్తున్న క్రైస్తవులు

కాకినాడ ఆదిత్యలో క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు

## క్రికెట్ కిట్ అందజేత

ప్రజాశక్తి - కరప

స్థానిక కొత్తపేట వీధికి చెందిన యువతకు హైస్కూల్ పూర్వపు విద్యార్థులు క్రికెట్ కిట్‌ను అందజేశారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు విజ్ఞప్తి మేరకు కరప హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం బొల్లమరెడ్డి వీరవెంకటసత్యనారాయణ, ఆత్రేయపురపు ఉదయ్ స్పందించి రూ.15 వేల వ్యయంతో క్రికెట్ కిట్‌ను కొత్తపేట యూత్‌కి మంగళవారం అందజేశారు.

# యానాం వార్తలు

## సమస్యలపై అధికారులతో మల్లాడి భేటీ

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలపై పుదుచ్చేరిలో వివిధ శాఖల అధికారులతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి చీఫ్ టౌన్ ప్లానర్, లా సెక్రటరీలతో చర్చించినట్లు తెలిపారు. విద్యాశాఖలో పనిచేస్తున్న మిల్క్ బాయిలర్స్‌కి రూ.10 వేలు నుంచి రూ.18 వేలు వేతనం పెంచేందుకు ఫైనాన్స్ క్లియర్ చేసి చీఫ్ సెక్రటరీ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. ఈనెల 31లోపు జిఒ విడుదల చేస్తారన్నారు. ఒఎన్‌జిసికి సంబంధించి ఫైల్ డిపార్ట్మెంట్‌కి అందచేసినట్లు చెప్పారు. ఈనెల 31లోపు నగదు బదిలీ అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సాయి స్పోర్ట్స్ హాస్టల్‌కి సంబంధించిన ఫైల్ పిడబ్ల్యుడి సెక్రటరీ దగ్గర ఉందని, త్వరలో టెండర్లకు పిలిచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సిఎంకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## పేదలకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో ఉన్న చమురు సంస్థల నుంచి మత్స్యకారులకు ఇచ్చినట్టుగా అన్ని వర్గాల పేదలకు నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు సిఎం వి.వైద్యలింగంను కోరారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ములగపాటి ప్రసాద్‌రాజు, దున్నా చక్రవర్తి, చీకట్ల రామకృష్ణ, కన్నీడి సత్యనారాయణ, ఓలేటి శ్రీను, పి.సుబ్బరాజులు సిఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చమురు సంస్థల నుంచి వెలువడే కాలుష్యంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటివరకు సరైన ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, రైతులకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆయా చమురు సంస్థలపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం మాజీ సిఎం నారాయణస్వామి, మాజీ మంత్రి కందసామి, సిఎల్‌పి లీడర్ వైద్యనాథన్, ఇతర కాంగ్రెస్ నాయకులను కలిసి యానాం పరిస్థితిని వివరించారు.

## రామస్వామికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

పెరియార్ ఇవి రామస్వామి వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామస్వామి సమాజ వికాశానికి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రాజశేఖరన్, కెఎల్‌వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా తత్పరుడు నాగేంద్ర

ప్రజాశక్తి - కాజులూరు

నాగేంద్రను అభినందిస్తున్న అభిమానులు

సేవా తత్పరుడు డాక్టర్ డేగల నాగేంద్ర అని రామచంద్రపురం జనసేన ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం బందనపూడి గ్రామంలో నాగేంద్ర పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ సేవ తత్వంతోనే రాజకీయాల్లోకి వచ్చారని, గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఎంతమంది ఒత్తిడి చేసినా రాజకీయంగా జనసేన పార్టీలో ఉన్నారని, గ్రామాభివృద్ధి మేరకే గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీతో ఉండవలసి వచ్చిందన్నారు. నాగేంద్ర మాట్లాడుతూ ఎవరు ఎన్ని ఒత్తిడిలు చేసినా జనసేన పార్టీలో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు బొండా వెంకన్న, కాజులూరు డిసి లకాని కృష్ణచైతన్య, సర్పంచ్ డేగల తిరుమలవేణి, జనసేన నాయకులు సంపత్, కూనపురెడ్డి శివకృష్ణ పాల్గొన్నారు.

## 27న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ఈనెల 27న జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలపై పెంపుదలకు వ్యతిరేకంగా వైసిపి అధినేత వైఎస్ జగన్ ఇచ్చిన పోరుబాట కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆవాల లక్ష్మీ నారాయణ, పాగా సురేష్‌కుమార్, తలారి దొరబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మద్యం, మాదకద్రవ్యాల అనర్థాలపై ప్రచారం

ప్రజాశక్తి - కరప

మద్యం, మాదక ద్రవ్యాలకు యువత దూరం గా ఉండాలని జనవిజ్ఞన వేదిక(జెవివి) ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా జనవిజ్ఞాన వేదిక, మద్యపానం వ్యతిరేక ప్రచార కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ కరప మండలంలోని మద్యం, మాదకద్రవ్యాలు మత్తులో యువత జీవితాన్ని నాశనం చేసు కోవద్దని, వాటి వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ పోస్టర్ల ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పరిశుభ్రతతోనే డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు నుంచి బయటపడగలమని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సునీత అన్నారు. మంగళవారం మండలం లోని చిన్న జగ్గంపేట గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ కిషోర బాలిక ఆరోగ్యం, పిల్లల ఆరోగ్యం, రక్తహీనత నివారణ పౌష్టికాహారంపై దృష్టి సారించాల న్నారు. గర్భి ణులు ఆసుపత్రిలోనే కాన్పులు చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వాటిని నివారించవచ్చునని అన్నారు. 18 సంవత్సరాల నిండిన అందరికీ గ్రామంలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, ఆశాలు పాల్గొన్నారు.

## సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో మంగళవారం గౌతమి మోడల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒహెచ్ఎంఎస్ ప్రయోగం, రెసిస్టెన్స్, కారకాలు, వివిధ భాగాల ప్రయోగంతో అమ్మీటర్, ఓల్టు మీటర్ రీడింగుల ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులతో ప్రయోగాలు చేయించారు.

**దస్తావేజు పోయినది**

మా క్లయింటు అయిన పెన్మెత్స విజయలక్ష్మి, భర్త లక్ష్మీ నరసింహరాజు, జయేంద్రనగర్, కాకినాడ అను వారు ది **14-12-2024**న వారి ఇంటి నుండి సర్పవరం జంక్షన్, కాకినాడకు దస్తావేజులు జెరాక్సు కోసం వెళ్ళుతుంటే మార్గ మధ్యలో ఆమె తాలూకు భూమి కాకినాడ రమణయ్యపేటకు చెందిన రి.స.నెం.**107/3**లోని **355.3** చ. గజముల స్థలము హద్దులు, **తూర్పు:** రోడ్డు, **పడమర:** ఇతరుల తాలూకు స్థలం, **ఉత్తరం:** గుత్తుల రామారావు గారి స్థలం, **దక్షిణం:** ధూళిపూడి వెంకట సూర్య కళ్యాణి గారి స్థలం, సదరు ఆస్థి తాలూకు రిజిస్ట్రీ దస్తావేజు నెం. **1059/1995** తేదీ ది **17-02-1995** దారి మార్గములో ఎక్కడో పడిపోయినది. ఎవ్వరికి అయినా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు అందజేయ వలసినదిగా తెలియజేయడమైనది. ఈ దస్తావేజు ఇతరులవ్వరైనా ఈ భూమిపై ఏమైనా లావాదేవీలు జరిపిన యెడల మా క్లయింటును బైండు చేయవని, అట్లు లావాదేవీలు చెల్లనేరవనిల తెలియజేయు చున్నాము.

శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
గుత్తుల శ్రీనివాసరావు
అడ్వకేట్స్,ముమ్మిడివరం 533216
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా
సెల్ నెం. 94400 41751

**మహారాజశ్రీ పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**EA35/2023 in EP1/2022 in OS.139/2019**

**Between:-**
పెనుపోతుల అబ్బాయి ...**DHR/Plaintiff**
మరియు
రాజాల సత్యనారాయణమ్మ మరియు ఇతరులు ...**JDRS/Defendents**

To,
JDR.No.2:- రాజాల రమేష్ S/o. రాజులు, 35 సం॥లు, ఆటో డ్రైవర్, పెనుపోతుల వారి వీధి, పాత SC పేట, భోగపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.
JDR.No.3:- పెనుపోతుల రాంబాబు, S/o. దొరబాబు, 45 సం॥లు, వ్యవసాయం, బోగాపురం, పిఠాపురం మండలం, కాకినాడ జిల్లా.

పై నెంబరు EA లో 2వ మరియు 3వ JDR అయిన రాజాల రమేష్ మరియు పెనుపోతుల రాంబాబు అనే మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సదరు **EA35/2023 in EP1/2022** లో ఎన్నిసార్లు నోటీసులు పంపించిన సదరు నోటీసులు తీసుకొనకుండా కలయాపన చేయుచున్నందున శ్రీ పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా మీరు ది, **30-01-2025**వ తేదీన ఉదయం **10.30** గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలియజేసెకోవలసిందిగా ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది. మీకు అలా హాజరు కానిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయుచున్నాము.

**//By Order of the Hon'ble Prl.Junior Civil Judge Court Pithapuram//**

**G.Surya Prakash Rao**
Advocate, Pithapuram,
Cell:7012842337

స్థల పరిశీలన చేస్తున్న ట్రాన్స్‌కో సిఎండి పృథ్వీరాజ్

## మెటీరియల్ స్టోరేజీ స్థల పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట విద్యుత్ సబ్ స్టేషన్లో మెటీరియల్ స్టోర్ చేసేందుకు అవసరమైన స్థలాన్ని ట్రాన్స్‌కో సిఎండి పృథ్వీరాజ్ మంగళవారం పరిశీలన చేశారు. కాకినాడ జిల్లా ఎస్ఇ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పర్యటనలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అన్ని మండలాలకు విద్యుత్ సామాగ్రి సరఫరా చేసేందుకు బొమ్మూరులో మెటీరియల్ స్టోర్ ఉండగా, జిల్లాల విభజన అనంతరం కాకినాడ జిల్లా పరిధిలో ఉన్న సబ్ స్టేషన్‌లకు మెటీరియల్ అందించేందుకు వీలుగా సామర్లకోటలో స్టోర్ ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతంగా గుర్తించి స్థల పరిశీలన చేశారు. అనంతరం సబ్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి బిల్లుల చెల్లింపులు, ప్రగతిని సిఎండి పరిశీలించారు. ఈ పరిశీలనలో పెద్దాపురం ఇఇ ప్రభాకర్, ఎడిఇ కిరణ్‌కుమార్, ఎఇలు పి.రమేష్‌కుమార్, నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండల పరిషత్ కార్యాలయం 2023-24 సంవత్సరానికి సంబంధించిన రికార్డులను సోషల్ ఆడిట్ బృందం మంగళవారం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా ఆడిట్ బృందం ఎస్ఆర్‌పి పి. సింహాద్రి మాట్లాడుతూ బుధవారం నుంచి జాతీయ ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలకు సంబంధించి రూ.100 కోట్ల అంచనాతో జరిగిన 176 పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలు వచ్చే జనవరి 7వ తేదీ వరకూ జరుగుతాయని అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలలోనూ ఒకరోజు గ్రామ సభను నిర్వహించి ఆడిట్ చేస్తామన్నారు.

## 27న మండల పరిషత్ సరసభ్య సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈనెల 27వ తేదీ ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ శ్రీలలిత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 2025-26 సంవ త్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై చర్చ జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## సర్వీస్ రోడ్డును వినియోగంలోకి తెస్తాం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెం పంచాయతీ పరిధిలోని కుడివైపు సర్వీస్ రోడ్డును వినియోగంలోకి తీసుకొస్తామని పంచా యతీ కార్యదర్శి జ్యోతిసుధ తెలిపారు. సర్వీస్ రోడ్డు దుస్థితిపై ఎన్‌హెచ్-216 అధికారులతో చర్చించినట్లు తెలిపారు. అందరి సమన్వయంతో త్వరలోనే సర్వీస్ రోడ్డును వినియోగంలోకి తెస్తామన్నారు.

**SUMMONS**
(SUBSTITUTE SERVICE UNDER ORDER V RULE 20 CPC AS PER ORDERS OF THE HON'BLE COURT)
**IN THE COURT OF THE HON'BLE V ADDL. JUNIOR CIVIL JUDGE: KAKINADA**
**O.S. 376/2024**

Between
**Yendamuri Venkateswara Rao ... Plaintiff**
**And**
**1) Davuluri Nagamani**
**2) Davuluri Venkata Durgarao**
**3) Davuluri Suresh Kumar ..Defendants**
To,
**Davuluri Venkata Durgarao,**
S/o. Late Suryanarayana Murthy, aged 32 years, contract works, R/o. D.No. 2-16/1, Koti village, near Govt. School Building near Ramalayam, Korukonda Mandal.

That as per the orders of the Hon'ble court notice is hereby published that you shall appear before the Hon'ble court on **09-01-2025** either in person or through your advocate at **10:30 A.M,** if you fail to appear the matter will be heard and decided by the Hon'ble court as per law. Hence this substitute service of suit summons published as per the orders of the Hon'ble court dated: 09-12-2024.

Kakinada
22-12-2024

**BATCHU RAJESH,**
Advocate, D.No. 25-6-37/A,
Gamjamvari Street, Kakinada.

**మహారాజశ్రీ 5వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు,రాజమహేంద్రవరం**
**M.V.OP.273/2023**

**Between:**
MARISHE SRINU **...Petitioner**
And
Ch.Satish Babu and Others
**...Respondents**
**R2.** Motupalli Subba Rayudu, S/o. Bhadradri, Hindu, Male, Aged not known, Owner of Lorry bearing Regd. **No. AP-37-X-4569,** R/o. D.No:13-10, Madiwada, Akiveedu Mandal, W.G.Dt. BVRM DMC.(As per RC) **...2nd Respondent**

పై నంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూ ర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 27-12-2024** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషన్ లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్ మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)**

**B.మహేష్‌కుమార్**
అడ్వకేట్,రాజమండ్రి
సెల్:8885551188

రాజమండ్రి
24-12-2024

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా**
**Creditor I.P.44/2024**

**Between:-**
Putta Chandrasekhar **...Petitioner**
And
**R1.** Pothula Veera Venkata Srinivas Kumar, S/o Late Jagannadha Rao, Hindu, aged 53 years, School Assistant (Maths), ZP High School, Kanavaram Village, Rajanagaram Mandal, East Godavari District, R/o.D No 24-11-6/2, Racharla Vari Street, Near Skating Park, Weavers Colony, Rajamahendravaram,East Godavari District,
**R2.** Pothula Ravi Sai Akil, S/o Veera Venkata Srinivas Kumar, Hindu, aged 25 years, R/o D No 24-11-6/2, Racharla Vari Street, Near Skating Park, Weavers Colony, Rajamahendravaram East Godavari District,
**R3.** Pothula Sai Dhiraj @ Dhiraj, S/o Veera Venkata Srinivas Kumar, Hindu, aged 24 years, R/o D/No 24-11- 6/2, Racharla Vari Street, Near Skating Park Weavers Colony, Rajamahendra varam, East Godavari District,
**R4.** Tamma Veera Venkata Lokesh, S/o Veera Venkateswa Rao, Hindu, aged 28 years, R/o.D No 58-24-12, Sanjeev Nagar, Rajamahendra varam, East Godavari District,
**1,2,3,4, Respondents.**

పై గ్రంధములో 2,3,4, ప్రతివాదులకి 1వ ప్రతివాది, వ్రాసి ఇచ్చిన క్రయ దస్తావేజు నెం.**19950/2024** ది.**25-07-2024** SRO రాజమండ్రి సబ్ రిజిష్ట్రరు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన సదరు దస్తావేజు చెల్లదని మరియు 1వ ప్రతివాదిని ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని పిటిషనర్ పై కోర్టులో గ్రంధము దాఖలు చేసిఉన్నారు. కావున ఎవరికైనా పై గ్రంధములో ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఎడల ది.**06-01-2025** తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం **10.30** గం॥లకు స్వయంగా గాని, లేదా మీ ప్లీడరు ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనిచో కోర్టు చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకొందురు.

**(By Order of Court)**

**డి.విక్టర్‌బాబు**
**టి.రాజేశ్వరి**
అడ్వకేట్స్,రాజమండ్రి
సెల్:7794831531

రాజమండ్రి
18-12-24

**మహారాజశ్రీ రాజమహేంద్రవరం గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**ఐ.పి.నెం.5/2021**

పార్టీలు:-
**1.** శ్రీ శ్రీనివాస డిజైనర్స్, రిప్, ప్రొప్రయిటర్, దాసరి శ్రీనివాసరావు, తుని
**2.** దాసరి శ్రీనివాసరావు ...పిటీషనర్లు
మరియు
కొప్పర్తి సత్యనారాయణ వగైరా
...రెస్పాండెంట్లు

**2.** అద్దంకి రాంబాబు, హిందువు, వయస్సు 40సం॥లు,కేరాఫ్ అద్దంకి రాణి, డోరునెం.4-120, బాబానగర్, ఈతకోట-533238,రావులపాలెం, డా॥బి.ఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా.
**5.** మామిడి కాంతం అనే వడ్డీల కాంతం, హిందువు, వయస్సు 60సం॥లు వార్డు నెం.5, కొండావారి పేట, తుని-533401 కాకినాడ జిల్లా.
**7.** గారా ప్రభాకర రావు, (తండ్రి) పెద్ద నూకరాజు, హిందువు, వయసుస 50 సం॥లు, డోరు నెం.19-143, గారావారి బీడు, పాయకరావుపేట-531126, విశాఖపట్టణం జిల్లా.
**17.** చింతపల్లి శివారెడ్డి,(తండ్రి)(లేటు) చింతారెడ్డి, హిందూ,డోర్‌నెం.1-64, 2వ వార్డు,నెం.6,వేపచెట్టు వీధి, అమ్మాజిపేట, తుని,533401, కాకినాడ జిల్లా.
**28.** బండి కోటి, హిందువు, వయస్సు,32 డోరు నెం.8-9-73, పెద్దవీధి, తుని-533401, కాకినాడ జిల్లా.
**38.** కె.మణి, హిందువు, వయస్సు 52 సం॥లు, కేరాఫ్ పెద్దిరెడ్డి సత్య, పెద్దిరెడ్డి వారి వీధి, పాయకరావుపేట-531126.
**42.** తూతిక కామేశ్వరరావు, (తండ్రి) భాస్కరరావు, హిందువు, వయస్సు 48సం॥లు, డోరునెం.13-9-20, కొత్తపేట, గొల్లవీధి, విజయనగరం-535002, విజయనగరం జిల్లా.
**50.** యస్.వాసు, హిందువు, వయస్సు 40సం॥లు, కేరాఫ్ చందారామ్ బోసు, డోరు నెం.128, వీధి నెం.329, సాయినగర్, తుని-533401, కాకినాడ జిల్లా.
**85.** అంబికా కలెక్షన్స్, రిప్రజెంటెడ్ బై ప్రొప్రయిటర్, కె.సత్యనారాయణ, హిందువు, వయస్సు 45 సం॥లు, మాస్కు సెంటర్, మెయిన్ రోడ్డు, కాకినాడ, కాకినాడ జిల్లా.
**100.** బూడిద కృష్ణ, (తండ్రి) (లేటు) సత్యనారాయణ, కేరాఫ్ బూడిద వీరభద్రుడు, హాల్‌సేల్ & రిటైల్ క్లాత్ మర్చంట్స్, కొప్పర్తి బిల్డింగ్ ప్రక్కన, మెయిన్ రోడ్డు, తుని-533401, కాకినాడ జిల్లా. ...రెస్పాండెంట్లు

పై పిటీషనర్లు ఇన్సాల్‌మెంటుగా డిక్లేర్ చేయమని దాఖలు చేసిన పై పిటీషను మీ హాజరుకు గాను పై కోర్టులో **ది.2-01-2025** వ సం.రం. తేదీకు వాయిదా అయి వున్నది. కావున మీరు పై కోర్టు ఎదుట **ది.02-01-2025**వ సం.రం. తేదీ ఉదయం **గం.10.30** ని॥లకు స్వయముగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై మీ అభ్యంతరములు తెలియపర్చుకోగలరు. లేని యెడల పై పిటీషను మీ పరోక్షమున నిర్ధారింపబడును.

**యమ్.ఆర్.సత్యసాయి(రాంబాబు)**
పిటీషనర్ తరపున అడ్వకేట్,
డోరు నెం.86-11-11/1
వాద్రేవునగర్, తిలక్ రోడ్డు,
రాజమహేంద్రవరం.